రైతులకు శాపంగా డ్రెయిన్లు

అన్నదాతల నడ్డి విరిచిన వరదలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు వరదలు గుడ్లవల్లేరు మండలంలోని వరి రైతుల నడ్డి విరిచి కోలుకోలేని దెబ్బ తీశాయి. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయిన్లు పొలాల్లో మురుగునీటిని బయటకు వెళ్లకుండా రైతులకు శాపంగా మారాయి. వర్షం నీరు పొలాల్లో చేరి వరి పైరు కుళ్లిపోవడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది.

గుడ్లవల్లేరు: పంటే చేతికి వస్తుందని ఎదురు చూస్తున్న సమయంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు అపార నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. మండలంలో 3,430 ఎకరాల వరి పంట మునకొచ్చిందని అధికారులు తొలుత తమ నివేదికలో ప్రభుత్వానికి వెల్లడించారు. ప్రస్తుతం కేవలం 1,800 ఎకరాల్లోనే 35 శాతం పైగా పంట పాడైందని నివేదికను సమర్పించారు. అధికారుల అంచనాలకు అందని, అంతకు మించిన పంట వర్షం నీటిలో నానుతూ కుళ్లిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్లమన్నాడు, డోకిపర్రు, విన్నకోట, చినగొన్నూరు ప్రాంతాల్లో ఏడు వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. తమకు ఎకరానికి రూ.15వేల పరిహారం ప్రభుత్వం ఇస్తే గానీ నష్టం భర్తీ అవుతుందని అంటున్నారు. కేవలం అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ వల్లనే తమ పొలాలకు ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహం వచ్చి పడుతోందని వాపోతున్నారు. మురుగు నీరు ఎగదన్నడంతో పొలాలు మరింతగా మునకకు గురవుతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. డోకిపర్రు, వడ్లమన్నాడులో వరద కారణంగా తీవ్ర పంట నష్టం ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయకపోతే రాబోయే ఖరీఫ్‌కు కూడా తాము ఆర్థికంగా కోలుకోలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిలో వ్యవసాయ సాగుకు ఎంత ఖర్చు పెట్టాలో అంతా కూడా చివరి పిచికారీ వరకు ఖర్చు చేశామని తెలిపారు. పంట చేతికి రావాలని రైతులు ఎదురు చూస్తున్న సమయంలో ఈ వరదల వలన అపార నష్టం ఏర్పడిందని బోరుమంటున్నారు. వడ్లమన్నాడు డ్రెయిన్‌ను ఆధునికీకరించడంతో పాటు రైతులకు పంట నష్టాన్ని అందజేయాలని కోరారు. నష్ట పరిహారం విషయంలో ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆదేశాలు వస్తే ఆ విధంగా రైతులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ బాలాజీ ఈ ప్రాంతానికి కొద్ది రోజుల క్రితం వచ్చి హామీ ఇచ్చారు. వచ్చే వేసవిలో రూ.54 కోట్లతో జిల్లాలోని డ్రెయినేజీల తవ్వకాల్లో భాగంగా వడ్లమన్నాడు డ్రెయిన్ తవ్వకానికి రూ.5 కోట్లు కేటాయించినట్లు ఆయన హామీ ఇచ్చారు.



వడ్లమన్నాడు డ్రెయిన్ దుస్థితి



మునిగిపోయిన పంటల నష్ట పరిహారం అంచనా వేస్తున్న అధికారులు

ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు ఇన్సూరెన్స్ ఇవ్వాలి



రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పంట సాగుకు ఖర్చు చేశారు. పంట చేతికి అందుతుందనే ఎదురు చూసే సమయంలో వరదలు వచ్చి నడ్డి విరిచాయి. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ కూడా ఇస్తేనే రైతులు నష్టపోకుండా ఉంటారు. లేకపోతే సాగుకు మరొకసారి పెట్టుబడి లేకుండా పోతుంది.

– పెన్నేరు రాజారావు, రైతు, వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు మండలం

ఎకరాకు రూ.15వేల పరిహారం చెల్లించాలి



వరి సాగు చేసిన రైతులకు ఎకరానికి రూ.15వేల నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలి. వరద నీటిలో వరి పంట కుళ్లిపోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్ల ఎదుటే మునిగిపోయాయి. పైరు కుళ్లిపోతున్నా ఎలా కాపాడుకోవాలో అర్థం కాకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ధైర్యాన్ని కల్పించాలి.

– మహ్మద్ బాజీ, రైతు, డోకిపర్రు, గుడ్లవల్లేరు మండలం

క్లుప్తంగా

బాధితులకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు



గుడివాడరూరల్: వరద బాధితులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నందివాడ మండలంలోని తమిరిశ గ్రామంలో వరద బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ పునరావాస కేంద్రాల్లో పర్యటించి బాధితులకు అందిస్తున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఆర్ఐ గణేష్, సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వో రవి పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి లడ్డూ ప్రసాదం రూ.5,116

గుడివాడ టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక ఏలూరు రోడ్‌లోని చిన్నకారుల ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో కార్ల స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక స్వామి వారి ప్రసాదం లడ్డూ బుధవారం వేలం వేశారు. భక్తులు మంజునాథ్ కార్ ట్రావెల్స్ అధినేత దేవాది నాగేశ్వరరావు – మహాలక్ష్మి దంపతులు రూ.5,116 కు వేలంలో ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

వరద బాధితులకు రూ.50 వేల సాయం



పామర్రు: ప్రజలందరూ సహృదయంతో స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదమద్దాలి గ్రామానికి చెందిన వీవీ రావు, కె. ప్రభాకర్‌రావు, ఎం.శివప్రసాద్, రామకృష్ణ గ్రామస్తుల సహకారంతో వరద బాధితుల సాయం నిమిత్తం రూ.50 వేల చెక్కును అందజేశారన్నారు. ఈ నగదును వరద బాధితుల సహాయార్థం వినియోగించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

గుడివాడ టౌన్: అంతర్రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో తమ విద్యార్థిని బంగారు పతకం సాధించినట్లు గౌతమ్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ ప్రకాశంజిల్లా ఒంగోలులో నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థిని కె.దేవిప్రియ అండర్–14 విభాగంలో బంగారు పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభను ప్రదర్శించిన కె.దేవీప్రియ, కోచ్ ఎన్. వెంకటేశ్వరరావును హైస్కూల్ ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించాలి



నందివాడ: వరదలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించాలని సీపీఎం, రైతు సంఘ నాయకులు ఆర్సీపీ రెడ్డి, జి.నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం నందివాడ మండలంలో కేంద్ర బృంద సభ్యులు వచ్చిన సందర్భంగా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ బుడమేరులోని ఆక్రమణలు తొలగించాలన్నారు. అదేవిధంగా బ్రిడ్జి ఎత్తు పెంచాలని కోరారు. పనులు కోల్పోయిన వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు నాయకుడు చల్లగుల్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొండపల్లి సుబ్బారెడ్డి, మురళి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి

గుడివాడరూరల్: వినాయక నిమజ్జనంలో తగు జాగ్రత్తలను పాటించి ప్రమాదాలు జరగకుండా నివారించాలని సామాజిక కార్యకర్త ఎ.రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని లింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమజ్జనంలో పాల్గొనే వారు మద్యం సేవించరాదని, కాల్వల్లో నిమజ్జనం చేసే టప్పుడు ఈత వచ్చిన నాలుగురు మాత్రమే వెళ్లాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ



కైకలూరు: ముంపు బారిన పడిన కైకలూరు మండలం కొల్లేరు గ్రామాలకు స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో 25 మెట్రిక్ టన్నుల పశువుల దాణాను బుధవారం ఉచితంగా పంపిణీ చేశామని స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్ తెలిపారు. పెంచికలమర్రు, కొట్టాడ, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, పందిరిపల్లిగూడెం, చటాకాయి, నత్తగుళ్లపాడులో ఒక్కో పశువుకు 25 కేజీల టోటల్ మిక్సిడ్ రేషన్ (టీఎంఆర్)ను అందించామన్నారు. కార్యక్రమంలో వడ్డీ సాధికకార సమితి రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు, పశు వైద్యుడు ఫణీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: కలెక్టర్ ఆదేశానుసారం, ఎమ్మెల్యే చొరవతో 13 కొల్లేటి ముంపు గ్రామాలకు సుమారు 2,500 పశువులకు సంపూర్ణ దాణాను బుధవారం పంపిణీ చేసినట్లు మండవల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ డీవీ వరప్రసాద్ తెలిపారు. పులపర్రులో పశువుల దాణా కార్యక్రమంలో చింతపాడు, కొవ్వాడలంక సర్పంచ్‌లు ఘంటసాల భాగ్యలక్ష్మి, జయమంగళ తిరుపతి వెంకన్న పాల్గొని రైతులకు దాణా పంపిణీ చేసినట్లు తెలిపారు.

రొయ్యూరులో కేంద్ర బృందం పర్యటన



నందివాడ మండలంలో కేంద్రబృందం సభ్యులకు నష్టాలను వివరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

పామర్రు(తోట్లవల్లూరు): వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం పర్యటించింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నియోజకవర్గంలో వరద నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కేంద్ర బృందాన్ని కలిసి వరద నష్టం సంబంధిత ఛాయా చిత్రాలను చూపి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర బృందంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రమణియం, విజయవాడ కేంద్ర రోడ్డు రవాణా హైవేస్ మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ ఇంజినీర్ రాకేష్‌కుమార్, హైదరాబాద్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్‌వీ శర్మ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

గుడివాడరూరల్: బుడమేరు వరదలు, ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకుంటామని కేంద్ర ప్రభుత్వ అధికారులు బృందం సభ్యులు పేర్కొన్నారు. నందివాడ మండలం పుట్టగుంట వద్ద ఉన్న బుడమేరును, బుడమేరు పరివాహక గ్రామాలను బుధవారం జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వరదలు, నష్టపోయిన వివరాలను కేంద్ర బృందం సభ్యులకు తెలిపారు. ఆర్డీఓ పి.పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రవాహం తగ్గుముఖం



పుట్టగుంట వంతెన వద్ద ప్రవాహం తగ్గి బయటపడిన రైలింగ్

గుడివాడరూరల్: బుడమేరు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు దిగువకు వెళ్లిపోతుండటంతో క్రమేపీ నీటి మట్టం తగ్గుతూ వస్తోంది. పుట్టగుంట వంతెన వద్ద నీటి ప్రవాహం రెండు అడుగుల మేర తగ్గి 21 అడుగులకు చేరింది. వంతెన రైలింగ్ 12 రోజుల తర్వాత బయటపడింది. వంతెనపై అడుగున్నర మేర నీరు ప్రవహిస్తుండటంతో ఎంఎన్‌కే రహదారిపై వాహన రాకపోకలను 12వ రోజు అధికారులు నిలిపివేశారు. బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో వరదనీరు తగ్గుతున్నా ఇంకా గ్రామాలకు ముంపు చెరవీడ లేదు. ఒద్దులమెరక, చేదుర్తిపాడు గ్రామాలకు పుట్టగుంట వైపు నుంచి నీరు తగ్గకపోవడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. చేదుర్తిపాడు గ్రామస్తులు కొయ్యగుర్రపాడు వైపు ముంపు తగ్గడంతో రాకపోకలు ఉంగుటూరు వైపు కొనసాగిస్తున్నారు. పెదలింగాల, చినలింగాల గ్రామస్తులు వరదనీరు తగ్గినా వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో అవసరాల కోసం ట్రాక్టర్లు ఉపయోగిస్తున్నారు. వరద ఉధృతి తగ్గినా గ్రామాల్లోని గృహాల్లో నీరు అలాగే ఉండిపోవడంతో పునరావాస కేంద్రాల్లోనే వరద బాధిత ప్రజలు ఉండిపోయారు.

ఆందోళనలో రైతులు

వరదల వలన బుడమేరు పరివాహక ప్రాంతాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన వరిపంట వరదల వలన ముంపునకు గురైంది. 12రోజులు గడిచినా ఇప్పటికీ పంట ముంపు నుంచి బయట పడలేదు. అధికారులు తూతూ మంత్రంగా వచ్చి పంట పొలాలను చూడటం వెళ్లడం చూస్తున్నారే మినహా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈనెల 17వ తేదీన నష్ట పరిహారం చెల్లింపుపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన చేస్తారని మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నారు. పంట నష్టం అంచనాలపై సర్వే చేయకుండా నష్టపరిహారం విషయమై ఏ ప్రకటన చేస్తారో అనే విషయంపై రైతుల్లో ఆందోళన నెలకొంది.

గణేశ్ మహరాజ్‌కీ జై

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవం



పామర్రులో గణనాథుడి ఊరేగింపు



గుడివాడలో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

పామర్రు: గణపతి నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు బుధవారం చలువ పందిళ్లలోని గణనాథులకు విశేషంగా పూజలు నిర్వహించారు. స్థానిక చల్లపల్లి రోడ్డు, నాలుగురోడ్ల కూడలి వద్ద, రాపర్ల ఎస్సీ కాలనీలోని గణనాథులకు గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు 'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై' అంటూ స్థానిక కాలువల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలో గణేశ్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గుర్రాల్లంకలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. తాడంకి గౌడ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి స్థానికంగా ఉన్న కాలువలో నిమజ్జనం చేశారు. ఎంపీపీ స్కూల్ ఏరియాలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గుడివాడలో పంచముఖ గణపతిగా స్వామి

ఘనంగా ఊరేగింపు

మండవల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో పెరికెగూడెంలో స్వామి వారి ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. అగ్రహారంలో ఉత్సవాలు ముగిసిన సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: వినాయక చవితికి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. స్వామి వారి విగ్రహాలను వాహనాల్లో ఊరేగింపుగా తరలించారు. భక్తులు జై గణేశా, జైజై గణేశా నినాదాలతో మేళతాళాలతో నృత్యం చేస్తూ స్వామిని స్థానిక పామర్రు రోడ్‌లోని పెద్ద కాల్వలో నిమజ్జనం చేశారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో వినాయకచవితి 35వ వార్షికోత్సవం నీలపాల శ్రీహరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని పాటిమీద ఏర్పాటు చేసిన వినాయక చవితి మహోత్సవం సందర్భంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తాడంకిలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



మండవల్లి మండలం పెరికెగూడెంలో స్వామి ఊరేగింపు



గుర్రాల్లంకలో వినాయక స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పంచముఖ గణపతిగా..


గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామిని పంచముఖ గణపతిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు.

శానిటేషన్ పనుల పరిశీలన

మండవల్లి: మండలంలోని మండవల్లి, ప్రత్తిపాడు, అప్పాపురం గ్రామాల్లోని శానిటేషన్ పనులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పరిశీలించారు. మండవల్లిలో రోడ్లు పరిశుభ్రం చేయడం, సున్నం, బ్లీచింగ్ చల్లించడం తదితర పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ, మెండా సురేష్ బుధవారం పరిశీలించారు. ప్రత్తిపాడులో సర్పంచ్ తపూడి యేసోబురాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అప్పాపురంలో పైపులైన్ పనులను సర్పంచ్ బుర్ల భోగేశ్వరరావు దగ్గర ఉండి సమీక్షించారు.

సంక్షిప్త వార్తలు

నిత్యావసర సరుకుల పంపిణీ



గుడ్లవల్లేరు: కౌతవరం పునరావాస కేంద్రంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ప్రభుత్వం అందించింది. బుధవారం బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె నిత్యావసర వస్తువులను బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బి.కనకదుర్గ, ఆర్ఐ షకీలాబేగం, టీడీపీ నాయకులు బాపయ్య చౌదరి, సుబ్రహ్మణ్యం, కృష్ణారావు, నరసింహారావు, పద్మజ, వీఆర్వోలు మల్లికార్జునరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

మోపర్రులో

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులకు అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, కూరగాయలను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదగా బుధవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి



కైకలూరు: రక్తహీనత నివారణకు మహిళలు చక్కటి పోషకాహార విలువలు కలిగిన పదార్థాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ వి.దీప్తి తెలిపారు. సీడీపీఓ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవితాన్ని కిషోర బాలికలు అలవర్చుకోవాలని సూచించారు. ఎంఈఓ డి.రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం పోషకాహారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, కృష్ణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు తాతారావు, శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ శ్యామల, ఏఎన్‌ఎం అనిత, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, నిర్మల, జ్ఞానసుందరి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా గుర్తింపు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హెచ్.వీ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు అటానమస్ హోదా 2024–34 వరకు కొనసాగుతుందని యూజీసీ అనుమతి పత్రాన్ని పంపిందని పేర్కొన్నారు. తద్వారా కళాశాలకు పాఠ్యాంశాలు, బోధన, పరీక్ష నిర్వహణ విషయంలో కళాశాలకు స్వయం ప్రతిపత్తి ఉంటుందని తెలిపారు. అటానమస్ హోదా పొందడంపై కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం ప్రకటించారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు



ముదినేపల్లి రూరల్: సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే నిర్దేశకులే ఉత్తమ ఉపాధ్యాయులని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో సత్కార సభను బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారితో పాటు ఎంఈఓ కె.నరేష్‌కుమార్‌ను సత్కరించారు.

ముంపు బారిన వరి పైరు



మండవల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరు దెబ్బతింది. మండలంలో 250 ఎకరాల్లో పైరు దెబ్బ తిన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కొన్ని పొలాల్లో బాగా దెబ్బతినగా, మరికొన్ని చోట్ల పూర్తిగా తుడిసిపెట్టుకు పోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పంట నష్టం సర్వే ప్రారంభం

ముదినేపల్లి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ముంపు బారినపడ్డ వరి పొలాల పంటనష్టం అంచనా సర్వేను వ్యవసాయాధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ సర్వేను మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పర్యవేక్షిస్తున్నారు. మండలంలో సుమారు మూడు వేల ఎకరాలకు పైబడి వరిపంటకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఈదులమద్దాలి(పెదపారుపూడి): గర్భిణులు పోషకాహారం కలిగిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ పెదపారుపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. మండలంలోని ఈదులమద్దాలిలో బుధవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలన్నారు.

మున్సిపల్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: పట్టణంలో మలేరియా, డెంగీ, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా పురపాలక సంఘ ఉద్యోగులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జి.బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో డాక్టర్ గురరాజు హోమియో కళాశాల ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ చేశారు.